పొంచి ఉన్న ప్రమాదం..!

- కోతకు గురైన గ్రామీణ రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


తలమద్రి మాన్కపూర్ రోడ్డులో నవేగావ్ వద్ద ప్రమాదకరంగా కల్వర్టు

ఇచ్చోడ: గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధ్వాన రోడ్లకు ఏళ్లుగా మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో అధిక గ్రామాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేక పోవడంతో పలు గ్రామాల నుంచి విద్యార్థులు మండల కేంద్రానికి ఆటోలో వస్తుంటారు. కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద, రోడ్ల అంచుల వెంట మట్టి కొట్టుపోయి గుంతలు ఏర్పడడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

ప్రమాదకరంగా రోడ్లు..

- మండలంలోని తలమద్రి నుంచి మాన్కపూర్ వెళ్లే రోడ్డులో నవేగావ్ గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టుకు కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. రాత్రి వేళలో కల్వర్టు వద్ద ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.
- మండలంలోని దాబా(బి) నుంచి సోన్‌పెల్లి వెళ్లే రోడ్డులో గొండుగూడ వద్ద రోడ్డుకు ఒక్కవైపు కోతకు గురైంది. ఈ రోడ్డుగుండా దాబా(బి), సోన్‌పెల్లి, బాదిగూడ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు.
- మండల కేంద్రం నుంచి జాతర్ల వెళ్లే రోడ్డులో ఇచ్చోడ తండా మూల మలుపు వద్ద భారీ గుంత ఏర్పడింది. ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- గేర్జం చించోలి గ్రామాల మధ్య వర్షాకాలంలో రోడుకిరువైపులా కోతకు గురైంది. ఈ రోడ్డు గుండా దాదాపుగా 20 గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. రాత్రివేళలో ప్రమాదం పొంచిఉంది.
- పొన్న ఎక్స్ రోడ్డు నుంచి తలమద్రి వరకు దాదాపుగా కిలో మీటర్ పోడువున బీటీ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈరోడ్డు గుండా ప్రయాణించే వారు తరుచు ప్రమాదాలకు గురువుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండల కేంద్రం నుంచి జాతర్లకు వెళ్లే రోడ్డుకు తండా మూలమలుపు వద్ద ప్రమాదకరంగా మారింది, సంబంధిత శాఖ అధికారులు కోతకు గురైన చోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. రాత్రివేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– జాదవ్ రమేశ్, ఇచ్చోడ తండా

చర్యలు చేపట్టాలి



మాన్కపూర్ నుంచి తలమద్రికి వెళ్లే రోడ్డులో నవేగావ్ కల్వర్టు వద్ద భారీ గుంతపడి ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు భారిన పడకముందే నివారణ చర్యలు తీసుకోవాలి. కనీసం వాహనాలు కూడా వెళ్లలేని గ్రామాలు కూడా ఉన్నాయి.

– మాడవి మారుతి, మేడిగూడ

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సిరికొండ మండల కేంద్రానికి చెందిన బి.లక్ష్మికు రూ.39వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సిరికొండ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, బోథ్ మాజీ మండల అధ్యక్షుడు కుర్మే మహేందర్, సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, మాధవ్ పటేల్, సాదుల్లా, పాల శంకర్, జాదవ్ కపిల్ దేవ్, ఇమామ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు రమాకాంత్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 సంవత్సరంలో చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం పెను ఉప్పెనకు కారణమైందన్నారు. ఫిబ్రవరి 28 వరకు సైన్స్ దినోత్సవానికి సంబంధించి జీవ పరిణామక్రమ సిద్ధాంతం గురించి ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి ఊశన్న, నారాయణ రెడ్డి, గంగన్న, ప్రేమ్‌కుమార్, శ్రీధర్‌బాబు, లింగన్న, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

పశు సంపద పెంపొందించాలి


మందులు పంపిణీ చేస్తున్న ఏడీ రామారావు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పాడి రైతులు పశుసంపదను పెంపొందించేందుకు కృషి చేయాలని పశుగణన అభివృద్ధి సంస్థ ఏడీ రామారావు అన్నారు. ఆదివారం జైనథ్ మండల కేంద్రంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వైద్యం చేసి అవసరమైన మందులను పశు పోషకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా వ్యాధులు వస్తే పశువైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు. మూగజీవాలకు గర్భకోశ వ్యాధులు, సుడి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు గజానంద్, సురేశ్, సిద్ధార్థ్, శ్రీకాంత్, గోపాలమిత్రలు రాంరెడ్డి, నర్సింగ్, శివకుమార్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి


పత్తిని పరిశీలిస్తున్న షేక్ షకీల్

ఆదిలాబాద్‌రూరల్: పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని భీమ్ ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని హత్తిగుట్ట గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల పంటలకు పెట్టుబడి ఎక్కువ, దిగుబడి తక్కువ ఉండడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. సంవత్సరమంతా కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి క్వింటాలుకు కనీసం రూ.10 వేల ధర కల్పించి ఆదుకోవాలని కోరారు.

కిన్వట్ ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ నాయకులు


భీంరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇచ్చోడ: కిన్వట్ ఎమ్మెల్యే కేరం భీంరావును ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం ఆధ్వర్యంలో ఇచ్చోడ బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కిన్వట్‌లోని కేరం భీంరావు ఇంటికి వెళ్లిన నాయకులు ముందుగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇచ్చోడ బీజేపీ అధ్యక్షుడు కేంద్రే నారాయణ, దుక్రే దామోదర్, అంబేకర్ పాండురంగ్, పెందుర్ తుల్సిరాం, రమేశ్, కాగ్నెమానిక్‌రావు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బోథ్ నియోజకవర్గానికి దగ్గరగా ఉన్న మహారాష్ట్రలోని కిన్వట్ నియోజకవర్గ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కేరం భీంరావు గెలవడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కిన్వట్‌లో శనివారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఆయనను సన్మానించి మిఠాయిలు తినిపించారు. బీజేపీ నాయకులు ముండే సుధాకర్, కొండోబా, సోంటక్కే కిరణ్, విజయ్, రామకృష్ణ ఉన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో సంస్థ ద్వారా టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నవీన్ యాదవ్, మసూద్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన యువకుడు ప్రవీణ్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశాడు. వర్షాల కారణంగా రోడ్డు బురదగా మారి గుంతలు ఏర్పడటంతో బస్సు సేవలు నిచిలి పోయాయన్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బస్సులు వచ్చే విధంగా చూడాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఆదిలాబాద్‌టౌన్: చదువుతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం కళాశాలలో ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భక్తి, జాతీయవాదం, క్రమశిక్షణ ఎన్‌సీసీకి మారుపేరన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం ప్రత్యేక కోటా ఉంటుందని తెలిపారు. సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి చంద్రకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ నేతకాని మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నేతకాని కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపెల్లి నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా దూట మహేందర్, లింగన్న, ప్రధాన కార్యదర్శిగా జాడి రాజేశ్వర్, కార్యదర్శిగా గోదారి వినోద్, భక్తు రాజన్న, కోశాధికారిగా గొళలె పవన్‌లను ఎన్నుకున్నారు. గ్రామపెద్దలు మల్లయ్య, బండి విజయ్, రాజన్న, దుర్గయ్య, ప్రవీణ్, రాజేశ్వర్, రాజేశ్వర్, మల్లేశ్, గంగారాజు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలి


మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

నేరడిగొండ: బీజేపీ నూతన పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని, అందుకు అనుగుణంగా పోలింగ్ బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, రాజశేఖర్, రాములు, నారాయణ, పరశురాం, శ్రీను, లక్ష్మణ్, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, ప్రకాష్, నవీన్, ఉత్తం, జమీర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


బోనం ఎత్తుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మండలంలోని కుచులపూర్ గ్రామంలో ఆదివారం ఘనంగా అడేల్లి పోచమ్మ ఆలయ 4వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బోనం ఎత్తుకొని ఆలయంలో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలైన లింగి, పల్సి(కె), పల్సి(బి), లక్ష్మీంపూర్, సుంకిడి, పల్సి తండా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మెట్టి కిరణ్ కుమార్, సదాశివ్, అబ్దుల్లా, అభిరామ్ రెడ్డి, సునీత రెడ్డి, దేవ్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం చేయండి

తలమడుగు: డిసెంబర్ 1న హైదరాబాదులోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రాంతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ పేరిట జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు ముల్కల రాజేశ్వర్, ప్రకాష్, అశోక్, ప్రహ్లాద్, మలపతి సుభాష్, పాశం రాఘవేంద్ర, మచ్చ రఘు, పోశెట్టి, అడేలు, ప్రవీణ్, లింగన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. నాయకులు రాజేశ్వర్, కాటం రమేశ్, సోన్‌కాంబ్లే మనోహర్, కాంరాజ్ వాగ్మరే, దుండే సంతోష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

'సొమ్మొకరిది సోకొకరిదిగా ఎమ్మెల్యే తీరు'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ తీరు చూస్తే సొమ్మొకరిది, సోకు మరొకరిది అనేలా ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జైనథ్ మండలకేంద్రంలో మినీ స్టేడియంతోపాటు ఆకూర్ల నుంచి రూ.90 లక్షలతో చేపట్టబోయే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలలో కనీసం ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరు తీసుకోకపోవడం విచాకరమన్నారు. వారికి గౌరవం ఇవ్వకుండా మొండిగా వెళితే భవిష్యత్‌లో నిర్వహించే కార్యకమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, జగదీష్ రెడ్డి, జైనథ్ ఆలయ చైర్మన్ అడ్డి రూకేష్ రెడ్డి, బత్తుల శ్రీ నివాస్, మునిగేలా విట్టల్, చిత్రు పటేల్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ట్రెయినీ కలెక్టర్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్య ఆదివారం తనిఖీ చేశారు. వసతి గృహంలో వంటగది, టాయిలెట్స్‌ను, డార్మెటరీ, వంట సామగ్రి, కూరగాయలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? స్నానానికి వేడినీళ్లు, కోరినేషన్ చేసిన తాగునీరు అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు బుక్స్‌ను పరిశీలించి నాణ్యమైన విద్య అందుతుందా అని ఆరా తీశారు. చలికి పంపిణీ చేసిన దుప్పట్లను, రగ్గలను, బెడ్‌షీట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, ప్రధానోపాధ్యాయుడు మడవి కృష్ణరావ్, కరుణకర్, ఆశన్న, సందీప్ పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్ సమావేశంలో మహిళా నాయకులు

ఎదులాపురం: జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిని రెడ్డి, ఛాయదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమీన ఖాన్, కృష్ణవేణి, సంగీతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో నళిని రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా మహిళలను అగౌరవపర్చే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయడం లేదన్నారు. ప్రైవేటీకరణ చేస్తూ పెత్తందారులకు దేశ సంపదను దోచి పెడుతున్నారని విమర్శించారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

రోగులకు పండ్లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు శ్రావణ్ నాయక్ ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా రిమ్స్‌లో రక్తదానం చేశారు. విద్యానగర్‌లో బ్లాంకెట్ల పంపిణీ, కేఆర్‌కే కాలనీలో వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు అర్బాత్, సత్యం పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన కాసే సంధ్య అనే వివాహిత అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. శనివారం భర్తతో గొడవ పడగా ఇంటి నుంచి మహారాష్ట్రలోని తన పుట్టింటికి వెళ్తానని పిల్లలకు చెప్పి బయలుదేరి వెళ్లింది. ఆమె అక్కడికి చేరుకోకపోవడంతో ఆమె భర్త సుఖ్‌దేవ్ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: గత వారం రోజుల క్రితం తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులో ఓ వ్యక్తి రైలు నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా, నాలుగు రోజుల క్రితం చికిత్స పొందుతూ మరణించాడు. ఆ వ్యక్తికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో మహారాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్, మానవ సేవే మాధవ సేవ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అజీజ్, రాము, భూమన్న, గణపతి, మహారాష్ట్ర పోలీసులు సచిన్, అమిత్ పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): గ్రూప్-4, రైల్వే శాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన నిఖిల్‌ను మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించారు. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. తన స్వగ్రామానికి చెందిన యువకుడు ప్రభుత్వ కొలువు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాత

ఉట్నూర్‌రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలగంలోని మత్తడిగూడ, లక్కారం, ఉట్నూర్ సంతల్లో ప్రజాపాలన విజయోత్సవాల కళాజాత నిర్వహించారు. కళాకారులు ఆట పాటల ద్వారా ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత సమన్వయ కర్త, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆత్రం గోవింద్‌రావు, రాథోడ్ శంకర్, గోడం ఆశిశ్, కుమ్ర నగేశ్, ఈవో శంకర్, నాయకులు పాల్గొన్నారు.

15న ఆదివాసీ పర్ధాన్ సంఘం డివిజన్ కమిటీ ఎన్నికలు

ఉట్నూర్‌రూరల్: డిసెంబర్ 15న ఆదివాసీ పర్ధాన్ సంఘం డివిజన్ కమిటీని ఎన్నుకోనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎక్స్‌రోడ్డులో ఆదివాసీ పర్ధాన్ భవన్‌లో ఉట్నూర్ డివిజన్ కమిటీ కార్యవర్గ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో సమాజ పెద్దలు మెస్రం శేష్‌నారాయణ్, దాదేరావు, విశ్వనాథ్, గోవిందరావు, మెస్రం కేషవ్, నిరంజన్, రాందాస్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

ఇచ్చోడ: రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని గ్రామపెద్దలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో వీడీసీ నూతన కమిటీ కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అన్ని కుల సంఘాల నుంచి ఇద్దరు చొప్పున ఎన్నుకోవాలన్నారు. డిసెంబర్ 5న వీడీసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొనునున్నట్లు తెలిపారు.

న్యాయవాది సుధీర్‌కుమార్‌కు సేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సుధీర్‌కుమార్

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్‌కు సేవా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో శనివారం రాత్రికి నిర్వహించిన కార్యక్రమంలో బీసీ మాజీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ చేతులు మీదుగా పురస్కారం అందుకున్నారు. గత కొన్ని రోజులుగా సంగెం చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలకు ఈ పురస్కారాన్ని అందచేశారు.

భక్తిశ్రద్ధలతో బాజీరావు బాబా పుణ్యతిథి

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలో ఆదివారం స్థానికుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా పుణ్యతిథి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా భజన, కీర్తనలతో బాజరావు బాబా చిత్రపటంతో శోభాయాత్ర చేపట్టారు. భక్తులు పల్లకికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, ప్రధాన శిష్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు హాజరు కావాలని ఆహ్వానం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ఈనెల 28న ప్రారంభమయ్యే వైడూర్యపురం కబడ్డీ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని యువకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు.

పూర్తి వివరాలు నమోదు చేయాలి

తాంసి: సమగ్ర ఇంటింటా సర్వేలో భాగంగా చేపట్టిన వివరాల నమోదు కంప్యూటర్‌లో పూర్తిగా నమోదు చేయాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీ కుటుంబం వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి, తప్పులు లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే దాదాపు సర్వే పూర్తి కాగా.. మిగిలిన కుటుంబాల సర్వే కొనసాగుతుందన్నారు. ఎంపీవో లింగయ్య, తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: సిరికొండ మండలంలోని రాజంపేట గ్రామానికి చెందిన బందు పటేల్ ఇటీవల పాము కాటుకు గురయ్యాడు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని రిమ్స్ వైద్యులను సూచించారు.

నేరడిగొండ: ప్రముఖ కవి, రచయిత గంగారాం కుర్మేను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పరామర్శించారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

ఎదులాపురం: డిసెంబర్ 1న వికలాంగుల ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి వికలాంగ ఉద్యోగులు హాజరు కావాలని సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, తదితర అంశాల గురించి చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మహేందర్ రెడ్డి, కబీర్‌దాస్, ముఖీం పాల్గొన్నారు.